సాక్షి ములుగు

బుధవారం | 31 | మే | 2023



రెగ్యులరైజ్ చేయాలి

యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని ప్రముఖ సామాజిక వేత్త ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు.

- 8లో▸



వేల్పు జాతరను కాపాడుకుందాం

వేల్పు జాతరను కాపాడుకుందామని తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్‌కుమార్ అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
39^0 / 27^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కంట్రోల్ రూం ఏర్పాటు

భూపాలపల్లి రూరల్: అకాల వర్షాల వల్ల ధాన్యం కొనుగోళ్ల (బార్దాన్, రవాణా, దిగుమతి) సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ భవేష్ మిశ్రా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సెల్ నంబర్ల 8897069846, 8790966440కు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.

షాదీఖానా పనులు త్వరగా పూర్తిచేయాలి

భూపాలపల్లి రూరల్: షాదీఖానా పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముస్లిం మైనార్టీ షాదీఖాన నిర్మాణానికి సంబంధించిన ఆర్డర్ పత్రాలను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. నిర్మాణాన్ని త్వరగా చేపట్టాల్సిందిగా అధికారులకు ఫోన్ ద్వారా సూచించారు. షాదీఖాన నిర్మాణానికి రూ.75 లక్షలు మంజూరు కాగా ఎమ్మెల్యే మరో రూ. 25లక్షలు మంజూరు చేయడం పట్ల మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ మొహమ్మద్ ఇర్ఫాన్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్



కాటారం: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై మంగళవారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పీఆర్ డైరెక్టర్ హనుమంతరావు, సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయగా ఎంపీడీఓ శంకర్‌నాయక్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొని ఏర్పాట్ల గురించి వివరించారు. ఉత్సవాల నిర్వహణపై మంత్రి, అధికారులు చేసిన సూచనలు, సలహాలను నమోదు చేసుకున్నారు.

సింగరేణి కళాశాలల్లో ప్రవేశాలు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి మహిళ డిగ్రీ, పీజీ కళాశాల కొత్తగూడెంలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి తుకారం తెలిపారు. ఈ మేరకు కళాశాల లెక్చరర్లు మంగళవారం ఏరియాలోని కేటీకే 6వ గనిలో కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి ప్రవేశాలపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా తుకారాం మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో కొనసాగుతున్న మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో అనుభవజ్ఞులైన లెక్చరర్లతో విద్యాబోధన అందిస్తూ ప్రతీ ఏడాది ఎంతో మంది విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ప్రైవేట్ కళాశాలల్లో డబ్బులు ఖర్చు పెట్టే బదులు సింగరేణి కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మేనేజర్ నాగరాజు, లెక్చరర్ మాధవి, ఆశజ్యోతి, రేణుకలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో మెడల్స్



భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర స్థాయి సీఎం కప్–2023 క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఆర్చరీ విభాగంలో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు డీవైఎస్‌ఓ బుర్ర సునీత తెలిపారు. కాటారం మండలానికి చెందిన టి.రజిత 50 మీటర్ల కాంపౌండ్ ఈవెంట్‌లో గోల్డ్ మెడల్, సాహితి 60 మీటర్ల రికర్వ్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. మెడల్స్ సాధించిన వారిని ఎస్‌ఏటీఎస్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్, డీవైఎస్‌ఓ సన్మానించారు.

బీజేపీ ఎంపీపై కేసు నమోదు చేయాలి

భూపాలపల్లి అర్బన్: బీజేపీ ఎంపీ భూషణ్‌పై కేసు నమోదు చేసి మహిళా క్రీడాకారులైన రెజ్లర్లకు తగిన న్యాయం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరేళ్ల జోసెఫ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా క్రీడాకారులను వేధించిన ఎంపీపై చర్యలు తీసుకోకుండా శాంతియుతంగా ధర్నాలు చేస్తున్న క్రీడాకారులపై పోలీసులు దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. ఎంపీ పదవి నుంచి బర్తరఫ్ చేసి అసోసియేషన్ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలన్నారు.

‘బడిబాట’కు వేళాయె..

జిల్లాలో జూన్ 3 నుంచి కార్యక్రమం

- విద్యార్థుల సంఖ్యను పెంచుకోవడమే లక్ష్యం
- ఇప్పటికే గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలల క్యాన్వాసింగ్



ములుగు: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహణకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. జూన్ 3 నుంచి 17వ తేదీ వరకు బడిబాట నిర్వహించాలని ఉత్వర్వులు జారీ కావడం అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా రేపటి నుంచి గ్రామ స్థాయిలో సర్పంచ్ అధ్యక్షతన ఎస్‌ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వార్డు సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించి 15 రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమ లక్ష్యాలను తెలియజేస్తారు. అదే రోజు పాఠశాలల వారీగా బ్యానర్లు, కరపత్రాలను సిద్ధం చేసుకుంటారు.

విద్యార్థుల పెంపే లక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఇప్పటికే మన ఊరు –మన బడి కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేసిన విషయం తెలిసిందే. దీనికి తోడు జిల్లాలో రెండు సంవత్సరాలుగా 10వ తరగతిలో 10/10 పాయింట్లు సాధించి విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు. గురుకుల ప్రవేశాల్లో ప్రైవేటుకు ధీటుగా ప్రతిభను చూపుతున్నాయి. ఇలాంటి అంశాలను వివరిస్తూ 3 నుంచి 9వ తేదీ వరకు ఎన్‌రోల్‌మెంట్ నిర్వహిస్తారు. ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు డోర్ టు డోర్ వెళ్లి ఇంట్లో ఉన్న చిన్నారులు, చదువుతున్న క్లాస్ వంటి వివరాలను సేకరిస్తారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఇంగ్లిష్ మీడియం బోధనపై తల్లిదండ్రులకు వివరిస్తారు. ముఖ్యంగా బాలకార్మికులను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేస్తారు. ఇక 13వ తేదీన తొలిమెట్టు, 14వ తేదీన పాఠశాల పున:ప్రారంభం రోజు సామూహిక అక్షరాభ్యాసం, 15వ తేదీన చిన్నారులు, బడిబయటి విద్యార్థులను గుర్తించడం, 16వ తేదీన పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంపై అవగాహన, 17న బాలికల విద్య, కెరీర్ గైడెన్స్‌పై కార్యక్రమాలు ఉంటాయి.

గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలల క్యాన్వాసింగ్

ప్రభుత్వ పాఠశాలల తరఫున బడిబాట కార్యక్రమం మొదలు కాకముందే ఇదే అదనుగా భావించి ములుగు, నర్సంపేట, హనుమకొండ, వరంగల్ వంటి ప్రాంతాలకు చెందిన ప్రైవేట్ పాఠశాలలు క్యాన్వాసింగ్ జోరును పెంచాయి. ఉదయం 6గంటల నుంచి రాత్రి వరకు గ్రామాల్లో తిరుగుతూ టెక్నో స్కూల్, ఐఐటీ, సీబీఎస్‌ఈ పేర్లతో తల్లిదండ్రులను ఒప్పించి అడ్మిషన్లు చేయిస్తున్నాయి. స్థానికంగా పేరున్న వారిని వెతికిపట్టుకొని పర్సంటేజీల పేరుతో వెంట తిప్పుకుంటూ సొమ్ముచేసుకుంటున్నారు.

బడిబాటను విజయవంతం చేస్తాం

విద్యాశాఖ ఆదేశాల మేరకు వచ్చే నెల 3వ తేదీ నుంచి 17వ తేదీ వరకు చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచేలా ప్రణాళిక రూపొందిస్తాం. సమన్వయ సమావేశంలో రోజు వారీగా చేపట్టే కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తాం. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులను, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తాం.

\- పాణిని, డీఈఓ

గట్టమ్మతల్లికి మంత్రి మొక్కులు



గట్టమ్మతల్లికి మొక్కులు చెల్లిస్తున్న మంత్రి

ములుగు రూరల్: మండల పరిధిలోని జాకారం పంచాయతీ పరిధి గట్టమ్మ తల్లికి మంత్రి సత్యవతిరాథోడ్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలోని పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి ఆది దేవత గట్టమ్మతల్లికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గట్టమ్మ సమీపంలో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ మ్యాప్‌ను కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్, ఎస్పీ గాష్ ఆలంతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, జెడ్పీటీసీలు సకినాల భవాని, రుద్రమదేవి, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు విజయ్‌కుమార్, గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు విజయ్‌రాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేయొద్దు



పోలీసులతో గ్రూప్‌ఫొటో దిగుతున్న ఎస్పీ

వెంకటాపురం(ఎం): విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని ఎస్పీ గాష్‌ఆలం అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ లోని పలు రికార్డులను పరిశీలించి పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మరమ్మతులు చేయించిన క్వార్టర్స్‌ను ఎస్పీ ప్రారంభించారు. అనంతరం స్టేషన్‌లోని పోలీసు సిబ్బందికి హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో గ్రూప్ ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ రంజిత్ కుమార్, ఎస్సై తాజుద్దీన్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రజత పతకం



రజత పతకం అందుకుంటున్న అంజి

వెంకటాపురం(ఎం): గచ్చిబౌలీలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన స్టేట్ టోర్నమెంట్స్ లాంగ్ జంప్‌లో జిల్లాలోని వెంకటాపూర్‌కు చెందిన యువకుడు అంజి మూడో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించారు. వీరికి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ గచ్చిబౌలి స్టేడియంలో మెడల్ ప్రదానం చేసి సన్మానించినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, జిల్లా ఒలంపిక్ సెక్రెటరీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్



మాట్లాడుతున్న కిరణ్

ములుగు రూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు తోకల రవి ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్ విద్యావ్యవస్థలో అధిక ఫీజుల కారణంగా విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. అధిక ఫీజులను కట్టడి చేసే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో బుక్స్, యూనిఫాంల పేరుతో దోపిడీ చేస్తున్నారని దుయ్యబట్టారు. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఫీజుల నియంత్రణకు చర్యలు చేపట్టని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోత్ రమేష్, పవన్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గిరిజనేతర కులాలను ఎస్టీ జాబితాలో కలపాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు ఉయిక శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జూన్ 11న భద్రాచలంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన జీపు యాత్ర మంగళవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు బ్యాంక్ కోసం ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఉన్న గిరిజనేతర కులాలను ఎస్టీ జాబితాలో కలపాలని తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మాణం రద్దు చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జూన్ 11న నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, చంద్రయ్య, ఉయిక గోపి, శ్యామల వంశీ, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి



ధర్నా చేస్తున్న నాయకులు

ములుగు రూరల్(గోవిందరావుపేట): రైతులను నిలువుదోపిడీకి గురి చేస్తున్న మిల్లర్ల దోపిడీని అధికారులు అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. గోవిందరావుపేట మండల పరిధిలోని సోమల్లగడ్డ క్రాస్ వద్ద తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో మంగళవారం కలిసి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 1010 రకం ధాన్యం ఏ గ్రేడు కింది కొనుగోలు చేయాలని ప్రభుత్వం ధర నిర్ణయించినా మిల్లర్లు మాత్రం బి గ్రేడ్ ధాన్యంగా దిగుమతి చేసుకుంటూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తి అయిన వెంటనే ధాన్యం తరలించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు మిల్లర్లు క్వింటాకు 2 నుంచి 3 కిలోల ధాన్యం కోతలు విధించడంతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం డబ్బులను రైతుల ఖాతాలలో సకాలంలో జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గుండు రామస్వామి, సూర్యనారాయణ, నాగరాజు, నరహరి, శ్రీశైలం, లెనిన్, మహేందర్, సమ్మక్క, నర్సయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రామప్పలో సినీనటుల సందడి



రామప్ప ఆలయాన్ని దర్శించుకున్న సినీనటులు

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని పాలంపేటలో గల రామప్ప దేవాలయానికి విలన్ ఆనంద్, కమేడియన్లు మంగళవారం సందర్శించారు. రామప్పను నాటి కాకతీయులు అత్యాద్భుతంగా నిర్మించి, నాటి చరిత్ర, సంప్రదాయలను భావితరాలకు అందించాలన్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్లు స్వాగతం పలికారు. అనంతరం పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను టూరిజం గైడ్ ద్వారా తెలుసుకుని రామప్ప శిల్పకళ అద్భుతమని, ఇంత గొప్ప శిల్పాలను చెక్కిన నాటి శిల్పుల పనితీరు అద్భుతమన్నారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించారు.

దశాబ్ది ఉత్సవాలను పండుగలా నిర్వహించాలి

- వచ్చే నెల 7న జిల్లాకు మంత్రి కేటీఆర్ రాక
- అదే రోజు కలెక్టరేట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన
- దశాబ్ది ఉత్సవాల కార్యాచరణ సమీక్షలో మంత్రి సత్యవతిరాథోడ్



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

ములుగు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను మన ఇంటి పండుగలా నిర్వహించుకోవాలని రాష్ట్ర గిరిజన శిశు, సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జూన్ 2వ తేదీ నుంచి 22 వరకు నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాల కార్యాచరణ సమావేశాన్ని మంగళవారం కలెక్టర్ కృష్ణ ఆదిత్య అధ్యక్షతన నిర్వహించగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. తెలంగాణ రాష్ట్రం రావడం వల్లే జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతరకు రూ.100 కోట్లు ఖర్చు చేసి వసతులు కల్పిస్తున్నామన్నారు. రామ ప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చేలా సీఎం కేసీఆర్ కృషి చేశామన్నారు. రామప్ప చెరువు రిజర్వాయర్ అయ్యిందని తెలిపారు. ఏటూరునాగారం వంటి ప్రాంతాల్లో విద్యా, వైద్యం అందుతున్న తీరును చూస్తే ప్రభుత్వ పనితీరు అర్థం అవుతుందని వివరించారు. ఈ తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని చాటేలా అన్ని వర్గాల ప్రజలు, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేస్తూ దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. ఈ సంబురాల్లో భాగంగా బీసీ కులాలకు రూ.లక్ష ఇచ్చే పథకాన్ని ప్రారంభిస్తామని వివరించారు. సొంత భూమి ఉన్న వారు ఇల్లు నిర్మించుకునేందుకు రూ. 3లక్షలు అందిస్తామన్నారు. నిరుపేదలైన 300 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో ములుగు జీపీ ఉత్తమ పంచాయతీగా గుర్తింపు పొందినందుకు కలెక్టర్, జిల్లా యంత్రాగాన్ని, ఇంటర్మీడియేట్ రెండో సంవత్సరంలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచినందుకు విద్యాశాఖ, టీ హబ్‌కు న్యాక్ గుర్తింపుపై వైద్య శాఖ అధికారులను మంత్రి అభినందించారు.

17 వేల ఎకరాలకు పాస్ బుక్కుల పంపిణీ

వచ్చే నెల 24వ తేదీ నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా పోడు భూములకు దరఖాస్తులు చేసుకున్న 17 వేల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. జులై మొదటి వారంలో గృహలక్ష్మీ పథకాన్ని ప్రారంభిస్తామని, 1100 మందికి దళిత బంధు అందిస్తామని వివరించారు. సీఆర్పీలకు 12 నెలల జీతాలు మంజూరు అయ్యాయని తెలిపారు. 17వ తేదీన 28 గిరిజన పంచాయతీ భవనాలకు భూమిపూజ చేస్తామని వ్యాఖ్యానించారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,500 మంది మినీ అంగన్‌వాడీలకు అంగన్‌వాడీలుగా ప్రమోషన్ కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 94 మందికి లబ్ధి చేకూరనున్నట్లు తెలిపారు. 65 సంవత్సరాలు దాటిన వారికి రిటైర్‌మెంట్ ఇస్తున్నామని, అదే రోజు బెనిఫిట్స్ ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీఓ అంకిత్, అదనపు కలెక్టర్లు ఇలా త్రిపాఠి, వైవీ. గణేశ్, డీఎఫ్‌ఓ రాహుల్‌జాదవ్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఎంపీపీలు గండ్రకోట శ్రీదేవి, బుర్ర రజిత, సూడి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీలు సకినాల భవాని, రుద్రమ దేవి, పాయం రమణ, వలియాబీ, రియాజ్‌మీర్జా ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

7న మంత్రి కేటీఆర్ రాక

వచ్చే నెల 7వ తేదీన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ జిల్లాకు వస్తున్నట్లు మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన రూ. 65 కోట్లతో నిర్మిస్తున్న కలెక్టరేట్ భవనానికి శంకుస్థాపన, కలెక్టరేట్ అప్రోచ్ రోడ్డుకు భూమి పూజ చేస్తారని వివరించారు. అదే రోజు రామప్పలో ఇరిగేషన్ ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానిస్తామని తెలిపారు.

సకాలంలో పనులు పూర్తి అయ్యేలా చూడాలి



సమీకృత కలెక్టరేట్ భవనం మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

ములుగు: సకాలంలో కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల పక్కన నూతనంగా నిర్మిస్తున్న సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయం స్థలాన్ని, నిర్మాణ పనులను కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్, ఎస్పీ గాష్ ఆలంలతో కలిసి పరిశీలించారు. భవన నిర్మాణం జరుగుతున్న మ్యాప్‌ను చూశారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై కాంప్లెక్స్ నిర్మాణ ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గంథాలయ సంస్థ చైర్మన్ గోవింద్ నాయక్, ఆర్‌అండ్‌బి డీఈ రఘువీర్, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి తదితరులు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు రూరల్(గోవిందరావుపేట): అకాల వర్షాల కారణంగా కల్లాలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ డిమాండ్ చేశారు. గోవిందరావుపేట మండల పరిధిలోని చల్వాయిలో జాతీయ రహదారిపై మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన పంటలను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కల్లాలో ధాన్యం తీసుకు వచ్చి రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కాంటాలు నిర్వహించి నిర్వాహకులు సకాలంలో లారీల తీసుకురాలేక పోవడంతో ధాన్యం కల్లాల్లో తడిసి ముద్దవుతుందన్నారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. రైతులు పండించిన పంటలను మిల్లర్లు, నిర్వాహకులు, అధికారులు కుమ్మక్కై దోచుకుతింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకునేందుకు మౌలిక వసతులు కల్పించక పోవడంతో రైతులు నానాతంటాలు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతులకు పంట నష్టపరిహారం చెల్లించని పక్షంలో కలెక్టరేట్ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కొమురం ధనలక్ష్మీ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దాసరి సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, చాంద్‌పాషా, జంపాల ప్రభాకర్, శ్రీకాంత్, నాగేందర్‌రావు, బండి శ్రీనివాస నాగమణి, సాంబయ్య, ఏడుకొండలు, నాగలక్ష్మీఅనిల్ కుమార్, పాలడుగు వెంకటకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, జయమ్మ, ప్రకాశ్, రాంమోహన్, శరత్, తదిరతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

వరంగల్ క్రైం : సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి తెలిపారు. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిరుమల జంక్షన్ సమీపంలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని సమాచారంతో తనిఖీ చేశామన్నారు. అక్కడ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న గోపాల్‌పూర్‌కు చెందిన గట్ల రాజేష్, భీమారానికి చెందిన కొండిరెడ్డి శ్రీధర్‌రెడ్డిలను అరెస్టు చేసి, వారి నుంచి రూ.65,080 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారమని తెలిపారు. నిందితులను సుబేదారి పోలీసులకు అప్పగించినట్లు అయన వెల్లడించారు. టాస్క్‌ఫోర్స్ దాడిలో ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాస్‌రావు, జనార్ధన్‌రెడ్డి, ఎస్సైలు శరత్, లవన్‌కుమార్ పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ల హల్‌చల్



జనగామ: జనగామలో తెల్లవారుజామున చైన్‌స్నాచర్లు హల్‌చల్ చేశారు. మంగళవారం ఓ మహిళ ఇంటి ముందు ముగ్గువేస్తుండగా ఆమె మెడలోని మంగళసూత్రం లాక్కునే ప్రయత్నం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గణేష్‌వాడకు చెందిన మహిళ మాదాసు అన్నపూర్ణ తెల్లవారుజామున ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా చైన్‌స్నాచర్లు ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చి.. ఆమె మెడలోని మంగళసూత్రం లాగారు. తేరుకున్న అన్నపూర్ణ మంగళసూత్రాన్ని గట్టిగా పట్టుకుని.. దుండగులతో ప్రతిఘటిస్తూ.. పెద్దగా కేకలు వేసింది. అప్పటికే మంగళసూత్రం మెడలో నుంచి ఊడిపోగా దుండగులు ఎత్తుకు పోకుండా చేసిన ప్రయత్నంలో ఆమెకు స్వల్పంగా గాయపడింది. వెంటనే స్థానికులు 100కు డయల్ చేయగా, పోలీసులు చేరుకుని చైన్‌స్నాచింగ్ ప్రయత్నంపై ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఇళ్లలో చోరీ



నర్సంపేట రూరల్ : నర్సంపేట పట్టణంలో రెండు వేర్వేరు చోట్ల ఇళ్లలో చోరీ జరగగా ఏడు తులాల బంగారం అపహరణకు గురైనట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణంలోని టీచర్ కాలనీలో, రాణా ప్రతాప్ వెంచర్‌నందు ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. మంగళవారం సాయంత్రం ఇంటియజమానులు వచ్చి చూసే సరికి అనుమానం కలిగింది. పరిశీలించగా కల్లి సాంబయ్య ఇంట్లో మూడు తులాల బంగారం, ఇరప స్వామి ఇంట్లో నాలుగు తులాల బంగారం అపరహరణకు గురైనట్లు గుర్తించిన బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

ప్రముఖ సామాజిక వేత్త ప్రొఫెసర్ జి.హరగోపాల్

● కుక్టా జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సదస్సు



సదస్సులో అభివాదం చేస్తున్న వివిధ వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపక సంఘాల జేఏసీ బాధ్యులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి.. ఇందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి కృషిచేయాలని ప్రముఖ సామాజిక వేత్త, హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. తెలంగాణ వర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో 'చలో కాకతీయ' పేరిట కుక్టా(కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్) జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన అన్ని వర్సిటీల రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన ఆన్‌లైన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ వ్యవస్థల వైఫల్యాలే వర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపక వ్యవస్థకు మూల కారణమని, ఏళ్లతరబడి పనిచేస్తున్నా రెగ్యులరైజ్ చేయకపోవటం ప్రభుత్వ వ్యవస్థ వైఫల్యమేనన్నారు. ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తూ సెంట్రల్ వర్సిటీల మాదిరిగా రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ చేసి ఉంటే కాంట్రాక్టు అధ్యాపకుల వ్యవస్థ ఇంతలా పెరిగేది కాదని అభిప్రాయపడ్డారు. ఇటీవల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకలను రెగ్యులరైజ్ చేసినట్లుగా వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులనూ చేయాలన్నారు. వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, సమస్యపై తొలుత ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వడంతోపాటు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. వర్సిటీల వీసీల ద్వారా కూడా ప్రభుత్వాన్ని కోరేలా కార్యచరణ చేపట్టాలని పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ఆచార్య టి.పాపిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాధనలో వర్సిటీల అధ్యాపకుల పాత్ర ఎంతో కీలకమైనదని, రాష్ట్ర ప్రభుత్వం కొంతమేర గౌరవ ప్రదమైన వేతనాలు ఇస్తున్నదని అయితే.. ఉద్యోగ భద్రతను కోరుకుంటున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపాలని కోరారు.

కుక్టా జేఏసీ చైర్మన్ డాక్టర్ పి.కరుణాకర్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల మాదిరిగానే యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులకు రెగ్యులరైజ్ చేయాలని గతంలో హనుమకొండకు సీఎం కేసీఆర్ వచ్చినప్పుడు విన్నవించగా.. వీరిని కూడా రెగ్యులరైజ్‌చేసే అంశం పరిశీలించాలని ఆదేశించినా సంబంధిత అధికారులు పట్టించుకోవటంలేదన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తున్నట్లుగా ప్రకటించాలని సీఎంను ఈ సదస్సు ద్వారా డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘాల ప్రతినిధులు డాక్టర్ ఎ.పరశురామ్, డాక్టర్ బి.ధర్మతేజ, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ భూమయ్య, శ్యామ్, యశ్వంతరావు, చిర్రరాజు, బి.సతీష్, ఫిరోజ్‌పాషా, ఉపేందర్, సాధు రాజేష్, మాదాసి కనకయ్య, బి.వెంకటగోపీనాథ్, మామిడి లింగయ్య, సూర్యం, సదాశివ, రాజేశ్వరి, రంజిత్, మంథిని శంకరయ్య నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పు జాతరను కాపాడుకుందాం

● మైపతి అరుణ్‌కుమార్



కాసాల నాయుని ఆలయాన్ని పరిశీలిస్తున్న రిసెర్చ్ సెంటర్ బృందం

గంగారం : వేల్పు జాతరను కాపాడుకుందామని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మైపతి అరుణ్‌కుమార్ అన్నారు. గంగారం మానుకోట జిల్లా గంగారం మండల కేంద్రంలోని గుడిపాడు గుంపులోని చింతవారి వేల్పు జాతర పూర్వ చరిత్రపై బిరస ముండా రిసెర్చ్ సెంటర్ బృందం అధ్యయం చేసింది. మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఆఫైర్స్ న్యూఢిల్లీ వారు పార్ట్ ఆఫ్ మేడారం కింద కమిషనర్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ తెలంగాణ 10 కోయ వేల్పు జాతరపై చరిత్ర అధ్యయనం కోసం ఇచ్చిన వర్క్‌లో భాగంగా ఐటీడీఏ ఏటూరునాగారం ఆదేశాల మేరకు ఈ పరిశోధనను కొనసాగిస్తున్నామని బృంద సభ్యులు తెలిపారు. ఇక్కడ గ్రామ పెద్దలు తలపతులు, వడ్డెలు, యువ ఉద్యోగస్తులతో సుధీర్ఘంగా చర్చించిన బృందం అనేక వివరాలు సేకరణ చేసింది. అనంతరం పరిశోధన విద్యార్థి తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మైపతి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. గోదావరి పరివాహక ప్రాంతంలో 3 నుంచి 7 గొట్లకు సంబంధించిన కోయ ప్రజల వేల్పు జాతరలు మొత్తం 150 ఉన్నట్లు పరిశోధన బృందం గుర్తించిందన్నారు. ఈవేల్పు జాతర ప్రకృతి అనుసందాన జాతరలు అని అన్నారు. ఈ వేల్పు జాతరలుచరిత్రను బతికించటంలో భాగంగా 10 సంవత్సరాలుగా అధ్యయనాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఈ జాతరలకు కూడా ప్రత్యేక నిధులు కేటాయించి ఆదివాసీ వేల్పు జాతరలను రక్షించాలని అన్నారు. ప్రభుత్వాలు ఆదివాసీల జాతరలపై చిన్న చూపు చూస్తున్నాయని అన్నారు. సమ్మక్క సారలమ్మ జాతర ఆసియాలోనే అతిపెద్ద జాతర అని, ఆసమ్మక్క తమ్ముడే కాసలా నాయుడు అని వివరించారు. అందుకే రాయి బండాని వంశంలోని సమ్మక్కని చందా వంశీయులు కొలిస్తే చింత వారు సమ్మక్క తమ్ముడు అయిన కాసల నాయుడిని కొలుస్తున్నట్లు తెలిపారు. ఈ జాతర మేడారం జాతర తిరుగివారం హోలీ పున్నమిలో జరుగుతుందని, జాతర చివరి రోజు కాసుల నాయిని కట్ల ఆధారంగా ప్రకృతిని అంచనా వేసి వర్షాలు ఏ కార్తీలో పడతాయి. ఏ కార్తిలో పడవు అనే ప్రకృతి అంచనా కూడా ఈజాతరలో అంచనా వేసి ప్రకృతిని ఆరాధించే గొప్ప జాతర అన్నారు. పరిశోధనలో రీసెర్చ్ సెంటర్ ఇన్‌చార్జ్ కొమురం జ్యోతిష్, సభ్యులు కాక శ్వేత, కాక నవ్య, పాయం నందిని, తలపతి చింత వజ్జయ్య, వడ్డె యాప భిక్షపతి, చింత సతీష్, పెద్దమనుషులు సిద్దబోయిన లక్ష్మయ్య, జెజ్జిరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

దామెరవాయి అడవుల్లో స్మారక శిలలు

● గుర్తించిన 'టార్చ్ టీం ఆఫ్ రీసెర్చ్' సంస్థ



స్మారక శిలల వద్ద హెరిటేజ్ సంస్థ యువకులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్‌ఎస్ తాడ్వాయి మండల పరిధి దామెరవాయి అడవుల్లో పాతరాతి యుగం నాటి స్మారక శిలలను గుర్తించారు. దామెరవాయి గ్రామానికి చెందిన పునెం శ్రీధర్ సమాచారం మేరకు టార్చ్ టీం ఆఫ్ రీసెర్చ్ ఆన్ కల్చర్ హెరిటేజ్ సంస్థ సభ్యులు, స్థానిక యువకులు బి.కార్తీక్, కె.శ్రీకాంత్ గ్రామానికి ఉత్తరం దిక్కున మూడు కిలోమీటర్ల దూరంలోని కప్పలాయి సమీప అడవిలో పాతరాతి యుగం నాటి మూడు మానవ స్మారకశిలలను గుర్తించి పరిశోధన చేశారు. వివరాలు వారి మాటల్లోనే.. ఆదిమానవులు సమాధుల వద్ద నిలువురాళ్లు పాతే పద్ధతి పాటించేవారు. స్థానిక సమూహంలో ముఖ్యులుగా భావించేవారి సమాధుల వద్ద పాతే అలాంటి రాళ్లను మెన్హిర్లు, నిలువురాళ్లు అంటారు. తెలంగాణలో అలాంటి నిలువురాళ్లు చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ 'సజీవం'గా ఉన్నాయి. అయితే వాటికి మానవాకృతి అద్దిన మెన్హిర్లు మాత్రం చాలా అరుదు. ఆంత్రోపోమార్ఫిక్ ఫిగర్స్‌గా పేర్కొనే ఈ రాళ్లు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో పరిమితంగా కనిపిస్తాయి. ఆరడుగుల ఎత్తు నాలుగున్నర అడుగుల వెడల్పుతో ఉన్న అరుదైన స్మారక శిల గుండ్రని తల, దీర్ఘచతురస్రాకారపు ఛాతీభాగం, భుజాలు, కిందికి నడుము భాగం పోల్చుకునేలా చెక్కి ఉన్నాయి. ఖమ్మం జిల్లాలోని కాచనపల్లి, గలబ, గుండాల ప్రాంతాల్లో ఆ శిలలకు పురుష, మహిళ రూపాన్ని కూడా చెక్కిన దాఖలాలున్నాయి. గోదావరి నది పరీవాహక ప్రాంతాన వెలుగులోకి వచ్చిన ప్రాచీన మానవుని సమాధులు నాటి మానవుని ఉనికిని తెలియజేయడమే కాకుండా మన ప్రాంతంలోని మానవ జాతుల పరిణామ క్రమాన్ని వెల్లడిస్తున్నాయి. ఇదివరకే కొత్తూరు గ్రామ సమీపంలో ఈ ఆకారాన్ని గుర్తించారు. దామెరవాయి సూరుగుండయ్య గుట్టపై ఆదిమానవుల సమాధులు సుమారు 145 ఉన్నాయి. సమీప గ్రామం కొత్తూరు మొట్లగూడెంలోని ఆదిమానవుల సమాధులను గ్రామస్తులు ఇళ్ల నిర్మాణాల కోసం ధ్వంసం చేయడం బాధాకరం. మిగిలిన చారిత్రిక ఆధారాలను, ఎంతో చరిత్ర కలిగిన ఈ స్మారక శిలలను పరిరక్షించాలని పురావస్తు శాఖ అధికారులకు, గ్రామస్తులకు టార్చ్ సంస్థ కార్యదర్శి, యువ చరిత్రకారుడు అరవింద్ ఆర్య కోరారు.

గేదెను ఢీకొన్న బుల్లెట్ బైక్

● వ్యక్తి దుర్మరణం

కురవి: దోస్త్ ఇంట్లో జరిగే శుభకార్యానికి బుల్లెట్ వాహనంపై మంగళవారం రాత్రి వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు చీకట్లో ఎదురుగా ఉన్న గేదెను గమనించక ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఖానాపురం హవేలికి చెందిన పడిగ ప్రవీణ్(29) పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన గుగులోత్ గణేష్‌లు ఇద్దరు కలసి బుల్లెట్ వాహనంపై ఖమ్మం నుంచి మంగళవారం రాత్రి సీరోలు మండలం ఉప్పరిగూడెం శివారు బూరుగుచెట్టు తండా జీపీకి చెందిన వారి మిత్రుడు బానోత్ సూర్య ఇంట్లో జరిగే శుభకార్యానికి(ముత్యాలమ్మపండుగ) వస్తున్నారు. ఉప్పరిగూడెం శివారు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే ఎదురుగా ఉన్న గేదెను ఢీకొట్టడంతో పడిగ ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గుగులోత్ గణేష్ తీవ్రంగా గాయపడగా.. ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై సీరోలు ఎస్సై నరేష్‌ను వివరణ కోరగా ఇద్దరు మిత్రులు బుల్లెట్ బైక్‌పై వస్తూ.. గేదెను ఢీకొనడంతో ప్రవీణ్ మృతి చెందగా.. గణేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

న్యూశాయంపేటలో మొసలి కలకలం



మొసలిని పట్టుకునేందుకు యత్నిస్తున్న జూపార్క్, ఫారెస్ట్ సిబ్బంది

కాజీపేట అర్బన్ : గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్‌లోని న్యూశాయంపేట నుంచి పద్మాక్షిరోడ్డుకు అనుకుని ఉన్న నాలాలో మంగళవారం మొసలి కలకలం రేపింది. స్థానికులు, జూపార్క్ రెస్క్యూ టీం కథనం ప్రకారం.. కాకతీయ జూపార్క్‌లోని మొసలి న్యూశాయంపేటలోని నాలాలో ప్రత్యక్షమైంది. గమనించిన స్థానికులు ఉల్లిక్కిపడి జూపార్క్, అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. సుమారు మూడు గంటల పాటు రెస్క్యూ టీం రాజు, సంతోష్, స్వామి, సాంబరాజులు శ్రమించినా ఫలితం లేకపోయింది. జూపార్క్‌లోని నాలా గుండా న్యూశాయంపేట నాలలోకి ప్రవేశించిన మొసలి జనాలను గమనించి తప్పించుకుంది. కాగా, ప్రతి ఏడాది వానొస్తే మొసలోస్తది అనే చందంగా తమ ప్రాంతం మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఫారెస్ట్ అధికారులు మొసలి ఉంది జాగ్రత్త అంటు బోర్డును పెట్టి, ఈ ఏడాది మంగళవారం రోజున పట్టుకునేందుకు యత్నించి, చేతులు దులుపుకున్నారని, మొసలిని పట్టుకుని, జూపార్క్ నాలాను జనావాసాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

మూగజీవాల మృత్యుఘోష

గడ్డి, నీరు పెడితే ఒళ్లుహూనం చేసుకుని కష్టపడి రైతులకు సహకారం అందించే పలు మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. మంగళవారం ఉదయం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉరుములు మెరుపులతో కురిసిన వర్షంతోపాటు పలుచోట్ల పడిన పిడుగులతో దుక్కిటెద్దులు, పాడి ఆవులు, గేదెలు మృతిచెందగా.. మరికొన్ని చోట్ల ఈదురుగాలులతో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి జంతువులు ప్రాణాలు కోల్పోయాయి. దీంతో ఆయా జీవాల యజమానులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రూ.లక్షల్లో నష్టపోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

పిడుగు పాటుకు పాడి ఆవు..



లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలోని నాగారంలో మంగళవారం పిడుగుపాటుతో కొలుపుల ఉప్పలయ్యకు చెందిన పాడి ఆవు మృతి చెందింది. సుడితో ఉన్న ఆవు విలువ సుమారు రూ.75వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకొని పరిహారం చెల్లించాలని బాధితుడు వేడుకుంటున్నాడు. ఇదిలా ఉండగా.. పిడుగుపాటుతో గ్రామంలోని వీధిలైట్లు, పలువురి ఇళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువులు ధ్వంసమయ్యాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా మరో నాలుగు చోట్ల పిడుగులు పడ్డాయి.

రాములునాయక్‌తండాలో..



నర్సంపేట రూరల్ : పిడుగు పడి దుక్కిటెద్దు మృతిచెందిన ఘటన మండలంలోని రాములునాయక్‌తండాలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని రాములునాయక్‌తండా గ్రామ శివారులోని హేమ్లాతండాకు చెందిన గుగులోతు ఈరు ఇంటి వద్ద పిడుగు పాటుకు దుక్కిటెద్దు అక్కడికక్కడే మృతిచెందింది. దీని విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు రోధిస్తూ తెలిపాడు.

అలింపూర్‌లో పాడి గేదె..



బచ్చన్నపేట: జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని అలింపూర్‌లో పాకాల శివకుమార్‌కు చెందిన పాడి గేదె మంగళవారం పిడుగు పాటుతో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. రోజూ మాదిరిగానే వ్యవసాయ బావి వద్ద గేదెను కట్టి ఉంచానని ఉదయం పిడుగులు పడడంతో గేదె మృతి చెంది ఉందని వాపోయాడు. రైతుకు రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ నరెడ్ల బాల్‌రెడ్డి, గ్రామస్తులు కోరారు.

విద్యుదాఘాతంతో గేదె, ఎద్దు



వర్ధన్నపేట: మంగళవారం ఉదయం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడి మేతకు వెళ్లిన గేదె, దుక్కిటెద్దు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లిలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం సంగెం మండలం లోహిత శివారు తండాకు చెందిన గుగులోతు యాకూబ్‌కు చెందిన దుక్కిటెద్దు, గుగులోతు శేఖర్‌కు చెందిన పాడి గేదె మేత కోసం మంగళవారం మధ్యాహ్నం ఉప్పరపల్లి శివారులో మేత మేస్తుండగా ఈదురు గాలులకు తెగి పడిన విద్యుత్ తీగలు తాకడంతో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. గేదె విలువ సుమారు రూ.80వేలు, దుక్కిటెద్దు విలువ రూ.90వేలు ఉంటుందని బాధితులు ఆవేదనతో తెలిపారు. తమకు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

కొంకపాకలో పాడి గేదెలు..



పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక గ్రామంలో విద్యుదాఘాతంతో వర్కాల ఎల్లస్వామికి చెందిన రెండు పాడిగేదెలు మృతి చెందాయి. వివరాలిలా ఉన్నాయి.. ఎల్లస్వామి రోజు మాదిరిగానే తన ఇంటి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గేదెలను కట్టేశాడు. మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్టు వైరు షార్ట్ సర్క్యూట్ కావడంతో గేదెలు మృతి చెందాయి. రెండు పాడి గేదెల మృతితో రూ.1.5లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు విలపించాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఎల్లస్వామి కోరాడు.


కరెంట్ షాక్‌తో గొర్రె..



రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని ఖిలాషాపూర్ 5వ వార్డులోని ఇనుప స్థంభానికి తాకి గొర్రె కరెంట్ షాక్‌తో మంగళవారం అక్కడికక్కడే మృతి చెందగా.. కాపరి తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి సురిగెల రవి ఉదయం వర్షం పడుతున్న సమయంలో పాకలోని గొర్రెలను బయటకు తోలుకెళ్తుండగా.. పక్కనే ఉన్న ఇనుప విద్యుత్ స్తంభానికి కరెంట్ సరఫరా అవుతుండటంతో గొర్రె తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మరణించింది. ఆందోళనకు గురైన కాపరి గొర్రెను లాగేందుకు యత్నించగా తనకు షాక్ కొట్టింది. స్థానికులు గుర్తించి కర్రలతో పక్కకు నెట్టడంతో ప్రాణాలతోబయట పడ్డాడు. ప్రమాదకరంగా ఉన్న ఇనుప స్తంభాలను తొలగించాలని విద్యుత్ అధికారులను పలు మార్లు కోరినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ ముప్పిడి శ్రీధర్‌తో పాటు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులు ఆందోళనకు సిద్ధం కాగా విద్యుత్ అధికారులు, సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మూడు ఇనుప స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను నాటారు.

ముల్కలగూడెంలో..

ఐనవోలు: పిడుగుపాటుకు గురై కాడెడ్లు మృతిచెందిన సంఘటన మండలంలోని ముల్కలగూడెంలో చోటు చేసుకుంది. ఎండిగ కొమురయ్య తనకు చెందిన రెండు కాడెడ్లను ఇంటి వెనుక దొడ్డిలో సోమవారం రాత్రి కట్టేసాడు. మంగళవారం ఉదయం వర్షం కారణంగా ఆలస్యంగా ఎడ్ల వద్దకు వెళ్లిన కొమురయ్యకు ఎడ్లు మృతిచెంది కనిపించడంతో కన్నీరు మున్నీరుగా విలపించాడు. పిడుగులతో కూడిన వర్షం కురువగా ఎడ్లు మృతిచెందాయని బాధితుడు వాపోయాడు. వీటి విలువ సుమారు రూ.1.2లక్షల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



దూదేకులపల్లిలో..



భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని దూదేకులపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి కురిసిన అకాల వర్షానికి విద్యుత్ వైరు తెగి కిందపడి ఉంది. ఈక్రమంలో మంగళవారం మేతకు వెళ్లిన నలవేని వీరయ్యకు చెందిన కాడెద్దుకు విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని వీరయ్య ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు.

కేవులా తండాలో..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని కేవులా తండా గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. తండాకు చెందిన బాదావత్ పాండ్యా తన ఎద్దులను మేత కోసం పొలానికి తీసుకువెళ్లాడు. ఈక్రమంలో అప్పటికే పొలంలో పడి ఉన్న విద్యుత్ తీగలు తగడంతో విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతిచెందింది. రూ.70 వేలు నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.



24 గంటల విద్యుత్‌తో ప్రజలకు మేలు



సర్కిల్ కార్యాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

భూపాలపల్లి రూరల్: 24 గంటల విద్యుత్ సరఫరా కేసీఆర్ కళ అని, దీంతో ప్రజలకు ఎన్నో రకాలుగా మేలు కలుగుతోందని జెన్‌కో చైర్మన్ ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ జిల్లా కార్యాలయాన్ని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్ గోపాల్ రావు, కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డిలతో కలిసి ప్రభాకర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రావు విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది విద్యుత్ సరఫరాలో తీసుకోవాల్సిన అంశాలనై వివరించారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మల్హార్, డీఈ నాగరాజు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో పూజలు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు దంపతులు దర్శించుకున్నారు. మంగళవారం సాయంత్రం ఆలయానికి రాగా ఆలయ అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మండపంలో గణపతి పూజ నిర్వహించి, స్వామివారికి పూజలు చేశారు.శ్రీశుభానందదేవి అమ్మవారికి పూజలు చేశారు. ఆయనను ధర్మకర్తలు కామిడి రాంరెడ్డి, అడప సమ్మయ్యలు శాలువాతో సన్మానించారు. అర్చకులు తీర్థప్రసాదం అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు. వారి వెంట ఎంపీటీసీ మమత, సర్పంచ్ వసంత, ట్రాన్స్‌కో ఎస్‌ఈ మల్హార్, ఏడీ నాగరాజు, జెన్‌కో డీఈ చందన్‌సింగ్, ఏడీ శ్రీనివాస్, ట్రాన్స్‌కో సిబ్బంది కిరణ్‌కాంత్, సదానందం పాల్గొన్నారు.

ఓసీపీ సందర్శన

మల్హర్: జయశంకర్ భూపాలపల్లి మల్హర్ మండలం తాడిచర్ల ఏఎమ్మార్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓసీపీ(ఓపెన్‌కాస్ట్ మైన్స్)ని జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా 2022–23 ఆర్థిక సంవత్సరంలో 25 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని నిర్దేశించిన లక్ష్యాన్ని గడువు లోగా టార్గెట్‌ను పూర్తి చేసిన సందర్భంగా ఏఎమ్మార్ అధికారులను, కార్మికులను ప్రభాకర్‌రావు అభినందించారు. ఇదే స్ఫూర్తి కొనసాగించి, మున్ముందు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని వివరించారు. జాతీయ రక్షణ అవార్డు పొందిన సందర్భంగా అభినందించారు. అనంతరం మైన్ ఆవరణలో కొలువుదీరిన దేవతా ఆలయాలను సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. జెన్‌కో డైరెక్టర్లు టీఆర్‌కే రావు, లక్ష్మయ్య, బాలరాజు, సీతు సిద్దయ్య, జీఎం మోహన్‌రావు, నితీష్‌రెడ్డి, ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్‌లు విశ్వనాథ్‌రాజు, ప్రభాకర్‌రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభాకర్‌రావు దంపతులను సన్మానిస్తున్న అర్చకులు